
# సామాన్యుని వాస్తవికత




కొడాలి పవన్ కుమార్

మన దేశంలో మంత్రిగారి కుక్క చచ్చి పడినందుకో—జబ్బు పడినందుకో, రాజకీయ నాయకుడు పదవి ఎక్కినందుకో-దిగినందుకో, అతనుచేసిన తప్పుడుపనులను పత్రికలలో ప్రచురించినందుకో — ఏదో ఒక కారణాన ఎక్కడో ఒకచోట ఎప్పుడూ సమ్మెలు జర్గుతూనే వుంటాయి. ఏదేమైనా మనది స్వతంత్ర భారతదేశం కదా!

వారంరోజులనుంచీ నిరసన ప్రదర్శనలు, పికెటింగ్ చేస్తోన్నా పాషాణం లాంటి ప్రభుత్వ హృదయం కరగలేదు. అందుకే ఆరోజు ముందుగా ఇచ్చిన ప్రకటన ప్రకారమే బంద్ చెయ్యాలని నిశ్చయించారు. దాదాపు రోడ్లమీద కొట్లన్నీ మూసేశారు. కాని కొంతమంది (అతి) తెలివిగలవాళ్ళు మాత్రం సగం తెరిచిన షట్టర్ల ద్వారా అమ్మకం సాగిస్తూనే వున్నారు. అన్ని ఆఫీసులు, ఆసుపత్రులు మూసేశారు. రోజూ కొత్త పెళ్ళికూతురు లాగా కళకళలాడుతూ ఎంతో రద్దీగా వుండే ఆ రోడ్లన్నీ ఆరోజు పసుపుకుంకు

మలు కోల్పోయిన విధవలా వెలవెలలాడుతూన్నాయి.

సమ్మెవలన క్లాసులు జరగటంలేదని కొంతమంది విద్యార్థులు విరాశపడ్తున్నా ఎంతోమంది సంతోషపడ్తున్నారు. కాని సినిమాహాల్సు కూడ మూసేయాటం వలన అంతమందీ బాధపడుతున్నారు. రోజూ ఆఫీసు ఫైళ్ళతో సతమతమయ్యే గుమాస్తాలకు ఆరోజు ఇంటిదగ్గర ఏమీ తోచటంలేదు. ఎక్కడో ఎవరన్నా అతి కష్టంమీద నిద్రపోయినా ఆఫీసు విషయాలని కలవరిస్తున్నారు. చిన్నారి పిల్లలు మాత్రం స్కూలు లేకపోయినందుకు సంతోషంతో కేరింతలు కొడ్తున్నారు.

అంతలో ఒక గుంపు నినాదాలు చేస్తూ రోడ్డుమీది కొచ్చింది. ఆ గుంపులో దాదాపుగా అందరూ దేశాన్నేలే భావి భారతపౌరులే! వారంతా ఎంతో ఉత్సాహంతో పెద్ద పెద్దగా అరుస్తూ, కేకలు పెడ్తూ, సగంతెరిపిన కొట్లను మూయిస్తూ ఎదిరించినవారిని దాక్షిణ్యంతో బెదిరిస్తూ విజయగర్వంతో వినాదాలు చేస్తూ ముందుకు సాగిపోతున్నారు.

ఆ సమయంలోనే దూరంగా ఓ రిక్షా బండీ అటువైపే వస్తోంది.

"ఒరేయ్! ఎవడో రిక్షావాడు వస్తున్నాడు. ఒకపట్టు పడదాం ఆగండిరా!" అన్నాడు గుంపుకు ముందుగా వున్న ఆజానుబాహులాంటి వ్యక్తి.


అందరూ సంతోషంతో నవ్వుతూ ఆగిపోయారు! రిక్షా వారిముందుకు వచ్చి ఆగిపోయింది.

రిక్షావాడికి నలభై ఏళ్ళ పైనే వుంటాయి. చిరిగిపోయి అక్కడక్కడా అతుకులతో కుట్టబడిన చొక్కా, పైకి దీసి కట్టిన గోచితో చూడ్డానికి అస్థిపంజరంలా వున్నాడు. ఏమీ అర్థంకాక భయాశ్చర్యాలతో అయోమయంగా వారి వైపు చూసాడు. బిక్కమొగంతో చూస్తోన్న ఇతన్ని చూసి ఆ గుంపులో వాళ్ళందరూ పగలబడి నవ్వారు.

గుంపుకి ముందున్నతను కోపంతో గర్జిస్తూ, "ఈవేళ బంద్ అని తెలిసి కూడ రిక్షా వేసుకువస్తావు టే! కూటికి కూడ గతిలేని బక్కనాకొడకా...నీకెంత ధైర్యంరా! మర్యాదగా వెనక్కిపోతావా లేదా!" అన్నాడు.

"అదికాదు బాబూ! నాలుగురోజుల నుంచీ జ్వరం తగిలి బండి లాగలేదు. నామీదే ఆశలు పెట్టుకొన్న ఇంట్లోవాళ్ళు ఈ నాలుగురోజులూ పస్తులతో మాడి చచ్చే స్థితిలో వున్నారు బాబూ. అందుకే ...బాబూ నీరసంగా వున్నా బండేసుకొని వచ్చాను—రెండు బేరాలు తగలకపోతయ్యా అవి! దయచేసి నన్ను పోనివ్వండి. మీకు పుణ్యముంటుంది" అంటూ ఎంతో దీనాతిదీనంగా వారిని అర్థించాడు.

"ఏంత్రోయ్! ఏదో సోది చెపుతున్నాడు...ఇక లాభంలేదు! మన తడాఖా చూపించండి."




గుంపులో ఆవేశం పెల్లుబికింది.

అంతే! కోతిమూకలా వారంతా విజృంభించారు. వాడిని పక్కకు లాగిపారేసి రిక్షాబండిపై తమ ప్రతాపాన్ని చూపించారు. రిక్షాఎక్కి తొక్కారు. బెల్ ఊడపీకారు. సీటు చించేసారు. బ్రేకులు లాగి పారేసారు. టాప్ చింపి పారేసారు. భావిభారత పౌరులు ఐదేఐదు నిమిషాల్లో కనీసపు సంస్కారం కూడ లేకుండా నానా బీభత్సాన్నీ సృష్టించారు.

పాపం! రిక్షావాడు పాడై పోతున్న రిక్షాను గుడ్లప్పగించి ఏడుస్తూ చూస్తున్నాడు. కాని అతని దీనచూపులు వారెవరినీ కదిలించలేదు. రిక్షాను నాశనంచేసిన కొంత సేపటికి వారు శాంతించారు. అలిసి పోయినట్లున్నారు పాపం! అందరూ రిక్షా దిగారు. వెధవని ఇలానే వదిలేస్తే పక్క సందులో రిక్షా తొక్కుతాడని చక్రాల్లో గాలి తీసేసారు. నిస్సహాయుడైన అతడు ఇదంతా చూస్తూ కుమిలి కుమిలి ఏడ్చాడేగాని ఏమీ చేయలేకపోయాడు. తన చేతగానితనాన్ని తిట్టుకుంటూ రిక్షాని భారంగా వెనక్కి లాక్కుపోయాడు.

విజయోత్సాహంతో ఆ గుంపు మరింత పెద్దగా కేకలుపెడ్తూ ముందుకు సాగిపోతున్నారు. హుషారు తగ్గకుండా ఉండటానికి వెంటతెచ్చుకొన్న బ్రాందీ సీసాల్లోని అమృతాన్ని కొస్త కొస్త గొంతులో ఒలికిస్తూ, వినాదాలిస్తూ ఒక గుడి దగ్గరకు సమీపించారు. అక్కడ ఆగి చుట్టూ కలియచూసారు. అంతా నిర్మానుష్యంగా వుంది.

ఆ గుడి కెదురుగావున్న సందు చివర్లో ఒక సోడాబండి ఆపి వుంది.

మళ్ళీ చేతులకు పని తగులుతున్నందుకు ఆ గుంపుకు ఎంతో సంతోషం కలిగింది. ఒకరికొకరు సైగలు చేసుకొంటూ సోడాబండిని సమీపించారు.

వస్తోన్న వారిని చూసి సోడాల కుర్ర వాడి కళ్ళల్లో కాంతులు మెరిసాయి. ఉదయాన్నుంచీ ఒక్కడుకూడ సోడా త్రాగిన పాపాన పోలేదు. అందుకే ఆ గుంపును చూడగానే అతనికి ఆనందం వెల్లి విరిసింది. సంతోషంతో "సోడా కొట్టమంటారా?" అనడిగాడు.

వచ్చినవాళ్ళు కోపంతో, "కాదు బండిని ఇంటికి పట్టుకెళ్ళమంటున్నాం" అన్నారు.

వాళ్ళేదో హాస్యానికంటున్నారను కొని, సోడాబుడ్లన్నీ ఖాళీ అయినాక ఇంటికి తీసికెళ్ళక మరెక్కడికి తీసుకుపోతానండి" తనూ నవ్వుతూ అన్నాడు.

గుంపుకంతకీ ఒకేసారి కోపం వచ్చింది. అందరి ముఖాలు ఎర్రగా కందగడ్డలా మారిపోయాయి. "వీడికి తలపొగరు చాలా వుండే. ఆలస్యం దేనికి-వదండి వాడిమీదకు" గుంపుకు వెనుకగా వున్నవాళ్ళు పెద్దగా అరిచారు.

వెంటనే అంతా సోడాబండిని చుట్టుముట్టారు. అందరి కళ్ళల్లో కసి బుసలు కొడ్తూ వుంది. 'తీర్థం' ఇంతకుముందే సేవించటంవలన కళ్లు ఎర్రగా, ఒళ్ళు చెమటతో తడిసి మెరుస్తోంది. అంతా నిశ్శబ్దంగా సోడాబండివాడివైపు తీక్షణంగా చూస్తూ ముందుకు వస్తున్నారు.

ఊహించని ఈ హఠాత్పరిణామానికి సోడా కుర్రవాడు నిశ్చేష్టుడయ్యాడు. వాడికి గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. వాడు ఏ క్షణంలో ఏమి చేస్తారో నని భయపడ్తూ బిక్కముఖంతో వారివైపే చూస్తున్నాడు.

ఆ సమయంలోనే ఒక సైకిల్ వేగంగా వచ్చి ఆ గుంపుకు వెనుకాలే ఆగింది. సైకిల్ పైమన్నతను క్రిందకు దిగి, "గురూ! ప్రక్కవందులోని కొట్లన్నీ మూయించేసాము. కాని మనకి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ఇటువైపే వస్తున్నారు. జాగ్రత్తగా వుండండి" అని రొప్పుతూ గబగబాచెప్పి సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

వాళ్ళంతా సోడాబండి కుర్రవాడి సంగతి వదిలేసి ముందుకొచ్చి నిలబడ్డారు. ఎదురుగా వచ్చే గుంపు వీరికి కాస్త దూరంలోనే వుంది. వాళ్ళ చేతుల్లో కర్రలు, సైకిల్ చైనులు వున్నాయి. వాళ్ళంతా పెద్దగా అరుస్తూ, గంతులు వేస్తూ ముందుకి వస్తున్నారు. వీళ్ళకు ఏమి చేయాలో పాలుపోవటంలేదు. వీళ్ళ దగ్గర ఆయుధాలేవీ లేవు. క్షణకాలం పాటు అంతా నిశ్శబ్దంగా వుండి ఒకరి ముఖాలొకరు చూసుకొన్నారు.

అంతలోనే అందరి ముఖాలు వికసించాయి. గబగబా సోడా బండిని సమీపించారు. తలావొక సోడాబుడ్డిని చేతుల్లోకి తీసికొన్నారు. ఒక్క నిమిషంలో అందరూ రోడ్డు కడ్డంగా నిలబడ్డారు. ఎదురుగా వచ్చే సమూహం వీరిని చూసి ఆగిపోయింది.

"మాకు వ్యతిరేకంగా వినాదాలిస్తో న్నారు. మీ కెంత ధైర్యంరా; మా సంగతి మీకు తెలిసినట్లు లేదు..."

అంతే! ఎదుటి గుంపులోవారి చేతు ల్లోని చైనులు, కర్రలు గాలిలోకి లేచి తిరుగుతోన్నాయి. వీళ్ళు కూడా సోడా బుడ్లు పైకెత్తి నిలబడ్డారు. ఇరువురికీ కొంత సేపు ఘర్షణ జరిగింది.

"మా దారి కడ్డం లేవండి" ఇరు వైపులా పెద్దగా అరచుకొంటున్నారు.

ఎవ్వరూ ఎవరి మాటా వినిపించు కోవటంలేదు!

"వాళ్ళతో మాటలెందుకు! కానియ్యండి రా" ఎవరో పెద్దగా అరిచారు. వెంటనే ఒకడు సోడాబుడ్డిని ఎదురు గుంపులోకి విసిరేశాడు.

వాళ్ళు రెచ్చిపోయి కర్రలు, చైనులతో వీళ్ళపై కలబడ్డారు.

ఇరుపక్షాలు భీకరంగా కొట్టుకొంటు న్నారు.

సోడా కుర్రవాడు సోడాబుడ్డి పట్టు కొన్నవాడి కాళ్ళు పట్టుకొని, "ఏమండీ! దయచేసి... "ఇంకా ఏదేదో మాట్లాడు తోనే వున్నాడు. ఎవ్వరూ అతని మాట లను వినిపించుకోవటానికి ప్రయత్నిం చటం లేదు.

అంతలో...

సోడావాడి నెత్తిమీద కర్రతో ఎవరో బలంగా కొట్టారు!

"అమ్మా!" అన్న కేకతో తను పట్టుకొన్నతని కాళ్ళు వదిలేసాడు. ఎవరో విసిరేసిన సోడాబుడ్డి అతని తలపై పడింది. తల పగిలిపోయింది. నెత్తురు ధారలై ప్రవహిస్తోంది. కళ్ళల్లో నీరసం కమ్ముకొనిరాగా అతికష్టం మీద నిలబడలేక నిలబడుతూ అక్కడినుంచి బైటకువచ్చి గుడిముందు గట్టుమీద పడి పోయాడు. శ్వాస ఆడటం కష్టంగా వుంది! ఎవ్వరూ తనను పట్టించుకోవటం లేదు. ఇంకా వాళ్ళు మూర్ఖుల్లాగానే పోట్లాడుకొంటున్నారు.

అంతలో 'పోలీసులొస్తున్నారు! పారి పోండి' ఎవరో పెద్దగా అరిచారు.

అంతే! వెంటనే అందరూ అటూ ఇటూ పరుగెత్తసాగారు. క్షణకాలంలో ఆ ప్రదేశమంతా నిశ్శబ్దంగా మారి పోయింది. గాలికి పైకిలేచిన దుమ్ము కొంచెంసేపు నిస్సహాయుడైన సోడా బండివాడిని ఓదార్చి ఇక లాభంలేదు అన్నట్లు నేలపై వాలిపోయింది.

సోడా కుర్రవాడు నీరసానికి తట్టుకో లేక స్పృహ కోల్పోతున్నాడు! అతడికి దాహం విపరీతంగా వేయసాగింది. తల పైకెత్తి చూసాడు. ఎదురుగా తన కాయకష్టం, తన జీవనాధారమైన సోడా బుడ్లన్నీ పగిలిపోయి నీటి మడుగుగా వుంది. కళ్ళవెంట కన్నీరు కారుస్తూ కొంచెంసేపు 'దాహం... దాహం' అంటూనే స్పృహకోల్పోయాడు.

అప్పటికే అక్కడికి పోలీసులొచ్చేసారు.

"దొంగ నా కొ... మనల్ని చూసి నటిస్తోన్నాడు" ఒక కానిస్టేబుల్ కర్రతో కొట్టాడు.

"లేవరా 'లం....కొడకా'" మరొక కానిస్టేబుల్ మోకాళ్ళపైబాదాడు. అయినా లేవలేదు. కొంత సేపు పోలీసులతని శరీరంతో ఆడుకొన్నారు.

ఎంతో సేపటికి సోడాబండివాడికి స్పర్శ తగిలినట్లుంది. కళ్ళు తెరిచి చుట్టూ చూసాడు.

పోలీసులు తనను చావబాదుతోన్నారు.

అతనికి ఆవేశంతోపాటు ఆవేదన కూడ కలిగింది. ఆ క్షణంలో ఏమి మాట్లాడుతున్నాడో అతనికే అర్థం కావటంలేదు. తనని ఇంత అశక్తుణ్ణి చేసిన అతని పేదరికం కళ్ళముందు కదలాడసాగింది.

ఆవేశంతో, "పే...ద...వాడు... నశించాలి, పేదవాడి... ఆ...క...లి... నశించాలి."

అతను అస్పష్టంగానే మాట్లాడుతోన్నా ఆవేదనతో కూడుకొన్న మాటలు కావున స్పష్టంగానే వినిపిస్తున్నాయి.

"వీడికి దెబ్బలు చాలినట్లు లేవు! వెధవ ఇంకా ఏదో అరుస్తోన్నాడు. సమ్మె చేస్తో నానా భీభత్సం చేసింది చాలక, అందరూ పారిపోతే ధైర్యంగా వీడొక్కడే యిక్కడ వున్నాడు. లాకప్‌లో పడేసి మక్కెలిరగతంతే కాని బుద్ధిరాదు వెధవికి! వ్యాన్‌లో పడేయండి..." ఎస్.ఐ. కరకుగా అరిచాడు.

కానిస్టేబుల్స్ సోడాబండివాడి పెడరెక్కలు విరిచి పట్టుకొని వ్యాన్‌లోకి విసిరేశారు.

అప్పటికే స్పృహకోల్పోయిన సోడాబుర్రవాడికి ఇవేమీ తెలియటంలేదు.

పోలీసులంతా అతన్ని గట్టిగా పట్టుకొని వ్యాన్‌లోకి ఎక్కారు.

వ్యాన్ శబ్దంచేస్తూ ముందుకి సాగిపోతోంది.

ఆరోజు బంద్‌ను గూర్చి దినపత్రికలో వచ్చిన వార్త.

"అక్కడక్కడా చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగిన బంద్."

అవును! ఏ మాటకామాటే చెప్పుకోవాలి మరి!

* * *

Printed and Published by A. Chandra Sekar Rao at 5-9-88 Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor A. SUDHAKARA RAO